**జర్నలిస్ట్ కథలు**

# అనగనగా మరో కాకిబావ

◆ జొన్నలగడ్డ రాధాకృష్ణ ◆

"సార్ భాధలో దేనికి వొత్తు పెట్టాలి సార్" అంది కొత్త సబెడిటర్ సరళ.

"బా'కి వుండదమ్మా" అన్నాడు న్యూసెడిటర్ సుబ్బారావు.

ఈ అమ్మాయి జర్నలిజం డిగ్రీ చదివి మరీ ఉద్యోగంలో చేరింది.

"సార్ బాధ బాగా ఎక్కువగా వున్నప్పుడు భాధ అని రాస్తే బావుంటుంది గదా" అంది.

"బాధ ఎంత ఎక్కువగా వున్నా అలా రాస్తే పరవస్తు చిన్నయ సూరిగారు ఒప్పుకోరు తల్లీ" అన్నాడు సుబ్బారావు విసుగ్గా.

"ఆయనెవరు సార్? మన ఎడిటర్త్రయం ఒకం గదా"

"ఆయనెవరైతే ఏంలే గానీ 'బా'కి వొత్తు పెడితే నేను మాత్రం వొప్పుకోను."

"భోధలో దేనికి పెట్టాలి సార్ వొత్తు?"

"ఓ పనైయ్... నువ్వు అన్నిటికీ పెట్టయ్ వొత్తులు. దేనికి అక్కర్లేదో నేను తీసెస్తాను. లక్ష వొత్తుల నోము అని వుంటుంది అది చేసి చూడు. దేనికి వొత్తు పెట్టాలో భోధ పడుతుంది" అన్నాడు సుబ్బారావు విరక్తిగా.

"సార్ హృదయ విధారకం అనోచ్చా సార్?"

"చెప్పాగదా తల్లీ మొత్తం అన్నిటికీ పెట్టేయ్. అక్కర్లేనివి నేను తీసెస్తాలే."

"ఏం లేదు సార్. ఈ వొత్తులతోటే వాస్తోంది తంటా. మిగతా అంతా ఈజీగానే వుంది" అంది సరళ దిగులుగా.

సుబ్బారావు ఏం మాట్లాడకుండా తల పట్టుకుని కూచున్నాడు.

"ఏం గురువు గారూ అలా కిన్నులే కూచోన్నారు" అన్నాడు అప్పుడే వొచ్చిన కబ్ రిపోర్టర్ కమలనాభం.

"కిన్నులు కాదయ్యా స్వామీ ఖిన్నులు అనాలి. అయినా ఇప్పుడు అంత భారమైన డైలాగ్ వాడాల్సిన అవసరం ఏం వొచ్చింది?" అన్నాడు సుబ్బారావు తల మరింత పదిలంగా పట్టుకుంటూ.

ఈలోగా ఎడిటర్ గారి బావమర్ది పంచాపకేశన్ "చంకరా, నాతశరీరా బరా, వేత విగారా కరా, చీవేశ్వరా, చంకరా..." అని పాడుకుంటూ ఆఫీసులో ప్రవేశించాడు.

నారదుడిలా ఎవడైనా పాడుకుంటూ ప్రవేశిస్తే సుబ్బారావు అస్సలు సహించలేడు. అందులో తెలుగు భాషని ఖూనీ చేస్తూ పాటలు పాడితే అస్సలున్నర సహించలేడు. కానీ ఇప్పుడతను చెయ్యగలిగింది ఏమీ లేదు. ఓ పేపర్ వెయిట్ పెట్టి తల మీద బాదుకోవడంకన్నా. పంచాపకేశన్ సాక్షాత్తూ ఈ పేపర్ ఎడిటర్ కం ప్రొప్రయిటర్‌కి బావమర్ది. అతన్నేవన్నా అంటే ఉద్యోగం వూడే ప్రమాదం వుంది.

ఓ కుర్చీ లాక్కుని సుఖాసీనుడైపోయి పాట కొనసాగిస్తున్నాడు పంచాపకేశన్. తన గాన మాధుర్యానికి తనే పరవశించిపోతూ కళ్ళు కూడా మూసుకున్నాడు.

పాటంతా అయిపోయాక కళ్ళు తెరిచాడు. అతని కళ్ళనించి ఆనంద బాష్పాలు రాలుతున్నాయి.

"నిండా బాగా రాసినాడప్పా 'చంకరా పరణంలో ఆత్రేయ వాడు.. పాటలో నిండా మీనింగ్ వుంటాయ్" అన్నాడు పంచాపకేశన్ కళ్ళు తుడుచుకుంటూ.

"తమ శార్ధం. ఆ పాట రాసింది ఆత్రేయ కాదు. వేటూరి. వేటూరి రాసింది కూడా తమరు అఘోరించిన విధంగా కాదు. తమరు హుస్సేన్‌సాగర్‌లోనైనా, దగ్గర్లో వున్న మరే ఇతర కుళ్ళు కాలవలోనైనా దూకి అవతారం చాలిస్తే ఈ ఆఫీస్ స్టాఫ్ యావన్మందీ సంతోషిస్తారు" అని అందామని నోటి చివరి దాకా వచ్చినా అలా అనడం వల్ల దేశంలో నిరుద్యోగ సమస్య పెరిగే అవకాశం వున్నందువల్ల అనలేదు.

కానీ కబ్ రిపోర్టర్ కమలనాభానికి ఇంక అంత ప్రపంచ గ్యానం అలవడనందువలన అనేశాడు.

"సార్ మీరు పాట మొత్తం రాంగ్ పాడేశారు సార్. ట్యూను కూడా రాంగే. సినిమా టైటిల్ రాంగే. రాసిన వాడు రాంగే. మొత్తం టోటల్ రాంగేసార్" అన్నాడు కమలనాభం.


"ఏం అప్పా నిండా తిమురుగ కూస్తా వుంటివి. ఇప్పుడే మా బావవానితో చెప్పి, కన్యాకుమారి ట్రాన్స్‌ఫర్ చేయిస్తానప్పాయ" అంటూ సీట్లోంచి లేవబోతున్న పంచాపకేశన్‌ని

బతిమాలి కూచోపెట్టాడు సుబ్బారావు. కమల నాభాన్ని మెత్తగా మందలించి పంచాపకేశన్‌ని శాంతింపజేశాడూ. ఈ కాలం కుర్రకారుకి పెద్దవాళ్ళంటే గౌరవం ఆటే వుండటం లేదని కవి హృదయం కూడా వీళ్ళకి బొత్తిగా అర్థం కావటం లేదని సర్ది చెప్పాడు.

పంచాపకేశన్ కొంత శాంతించాడు.

"పిల్లకాయలకి తెలుగు ట్రెయినింగ్ ఇవ్వాలప్పా. నేనే ఇస్తును. కానీ మన దగ్గిర టైము కమ్మిగా వుంటాయ్. నెక్స్ట మంత్ ఇస్తును వీండ్లకు నిండా ట్రైనింగ్" అని మళ్ళి పాడుకుంటూ వెళ్ళిపోయాడు పంచాపకేశన్.

సుబ్బారావు గుండే గుభేలు మంది పంచాపకేశన్ ప్రకటన విని. ఇప్పటికీ త్రయంబకం పద్యాల వల్ల బతికుంటే బలుసాకు తినచుని చాలామంది పాఠకులు ప్రజాగోల




పత్రిక కొనడం మానేసి వేరే పత్రికలు కొనుక్కుంటున్నారు. ఇప్పుడు వీడి బ్రాండ్ తెలుగు భాషలో వార్తలు రాస్తే అచిర కాలంలోనే పత్రిక సర్క్యులేషన్ జీరో అయిపోతుంది. ఈ ప్రమాదాన్ని ఎలా తప్పించాలో అర్థం కాలేదు.

అక్కడే వుండి అంతా విన్న గుర్నాథం "భయం లేదు... నేవున్నాను" అన్నాడు.

"అంతా విన్నావుగా? వీడు తెలుగు నేర్పిస్తాట్ట. పత్రిక ఏమైపోవాలి?" అన్నాడు సుబ్బారావు దిగులుగా.

"ఏం భయం లేదు. వీడి వీక్నెస్ కనిపెట్టేశా. వీడి వల్ల పేపర్‌కి ఎలాంటి ప్రమాదం జరక్కుండా చూడ్డం నా డ్యూటీ" అన్నాడు గుర్నాథం ధీమాగా.

సూబ్బారావుకి బొత్తిగా ఏమీ అర్థం కాలేదు.

"కాకి బావ... నక్క కథ చదివావా?" అన్నాడు గుర్నాథం సిగరెట్టు వెలిగించి.

చదివా అన్నట్టు తలూపాడు సుబ్బారావు.

"అందులో మాంసం ముక్క కోసం నక్క ఏం చేసింది?"

"మాంసం ఏవిటోయ్ ద్రాక్ష పళ్ళు గదా?"

"నువ్వు కన్‌ఫ్యూజ్ అయిపోతున్నావు. అది వేరే కథ. ఈ కథలో ద్రాక్ష పళ్ళుండవు. మాంసం ముక్క వుంటుంది. అనగనగా ఓ కాకి బావ ఓ మాంసం ముక్కని ఎత్తుకొస్తుంది. దాన్ని చూసి నక్కకి నోరూరి కాకి బావ నీ గొంతు ఎస్పీ బాలసుబ్రమణ్యం గొంతులా వుంటుంది. ఒక్క పాట పాడవూ అంటుంది. దాంతో చెట్టు మీద కూచోన్న కాకి బావ శంకరాభరణం పాట ఎత్తుకుంటుంది. నోట్లో మాంసం ముక్క కింద పడగా దాన్ని కరుచుకుని ఉడాయిస్తుంది. ఇది కాకి బావా... నక్క కథ... ఇందులో కాకి బావ పాత్ర పంచాపకేశన్, నక్క పాత్ర నేను వేశాం నిన్నరాత్రి" అన్నాడు గుర్నాథం.

"నాకేం అర్థం అయి చావటం లేదు. నాటకం వేశారా మీరిద్దరూ" అన్నాడు సుబ్బారావు ఆశ్చర్యంగా.

గుర్నాథానికి నవ్వీ నవ్వీ కళ్ళ నీళ్ళు తిరుగోతున్నాయి.

"ఏవిటోయ్ బోడి సస్పెన్స్. ఇంతకీ అసలేం జరిగింది నాటకం వేశారా లేదా" అన్నాడు సుబ్బారావు.

గుర్నాథం నవ్వుతో సతమతమయిపోతున్నాడు.

ఇంతలో అక్కడికి వొచ్చిన క్రైం రిపోర్టర్ చలపతి చెప్పాడు జరిగిన కథ.

"నిన్న రాత్రి నేనూ గుర్నాథం కాస్త గొంతు తడి చేసుకుందాం అనుకున్నాం. ఇద్దరి దగ్గిరా డబ్బుల్లేవు. ఎక్కడా అప్పు పుట్టలేదు. ఈ లోగా పంచాపకేశన్ శంకరాభరణం పాటలు పాడుకుంటూ పోతూ కనిపించాడు. గుర్నాథం అప్పైనా ఇవ్వకపోతాడా అని వాణ్ణాపి మీ గొంతు ముందు ఎస్పీ బాల సుబ్రమణ్యం గొంత బలాదూర్ సార్" అన్నాడు.

"వెంటనే వాడు పొంగిపోయి రోడ్డు మీదవో పాట పాడేశాడు. తోవన పోతున్న వాళ్ళు ఐదు పైసలు పది పైసలూ వీడి ముందు పడేశారు గానీ వీడు తన్మయత్వంతో కళ్ళు మూసుకున్నందువల్ల గమనించలే. అలా పన్నెండు రూపాయల వరకూ పోగయింది చిల్లర. సిగరెట్లకైనా పనికొస్తుందని జాగర్త చేశా. పాట అయిపోగానే గుర్నాథం హర్ష ధ్వానాలు చేసి, వంద రూపాయలు అప్పడిగాడు. ఆ వందతో ఏం చెయ్యదలుచుకున్నదీ కూడా వివరించాడు. నేను బతికుండగా మీరు అప్పులు చేసి మందుకొట్టడం ఏమిటీ అంటూ పంచాపకేశన్ దుఃఖ పడిపోయాడు. వెంటనే వాడి హోటల్ రూముకి తీసుకుపోయి ఏకంగా ఫుల్ బాటిల్ తెప్పించాడు. దాంతో పాటు చికెన్ ఫ్రై, చికెన్ సిక్స్టీ ఫైవ్, ఎయిటీ సెవెన్, వాడి పిండాకుడు ఏమిటేమిటో తెప్పించేశాడు.

"వాడు గ్లాసు నోటి దగ్గర పెట్టుకోబోయినప్పుడల్లా ఓ పాట పాడండి సార్ అంటున్నాడు గుర్నాథం. దెబ్బకి వాడు గ్లాసు కింద పెట్టేసి కళ్ళు మూసుకుని పాడేస్తున్నాడు. అలా వాడు ఒక్క గ్లాసుకూడా పూర్తి చెయ్యకముందే మేం ఇద్దరం కలిసి సీసా ఖాళీ చేసేశాం. అలాగే చేపలూ, చికెన్, రొయ్యలు సమస్తం కూడా. ఎప్పుడు పడితే అప్పుడు పాటలు విండానికీ, మందు కొట్టడానికి తన రూముకి వచ్చెయ్యొచ్చని స్టాండింగ్ ఆఫర్ కూడా ఇచ్చాడు" అని చెప్పాడు చలపతి.

"ఎంత ఫ్రీగా మందు పోస్తే మాత్రం ఆ దిక్కుమాలిన పాటలు వినాలిగా" అన్నాడు సుబ్బారావు.

"ఎవడు విన్నాడోయ్. అయినా రెండో పెగ్గు తరవాత ఎలాగూ వినపడదు గదా. వీడు పేపర్ జోలికి రాకుండా వుండాలంటే ఒకటే మార్గం కాకి బావా పాట పాడవూ అంటాం. ఆంధ్ర ప్రజల, ప్రత్యేకించి ప్రజాగోల పాఠకుల శ్రేయస్సు దృష్ట్యా కొంచెం కష్టమే అయినా భరించక తప్పదు" అన్నాడు గుర్నాథం.

సుబ్బారావు అతనితో పూర్తిగా ఏకీభవించాడు.